# నులిపురుగుల నిర్మూలనతోనే పిల్లల ఆరోగ్య పరిరక్షణ

## రెండు నుంచి 19 ఏళ్ల వయస్సు గల వారంతా డివార్మింగ్ మాత్రలు తీసుకోవాలి: డా. అరవింద్

**ఎల్కతుర్తి/, జూలై 13 (జర్నలిస్ట్ వార్త):** పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత, శారీరకమానసిక ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపే నులిపురుగులను నిర్మూలించేందుకు ప్రభుత్వం చేపట్టిన జాతీయ డివార్మింగ్ డే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యుడు డా. అరవింద్ పిలుపునిచ్చారు. ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రం, జడ్‌పీహెచ్‌ఎస్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం నిర్వహించిన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని రెండు నుంచి 19 ఏళ్ల వయస్సు గల చిన్నారులు, విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నులిపురుగుల కారణంగా పిల్లల్లో



రక్తహీనత, పోషకాహార లోపం, చదువుపై ఏకాగ్రత తగ్గడం, శారీరక ఎదుగుదల మందగించడం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ఏడాదికి రెండుసార్లు ప్రభుత్వం ఉచితంగా అందించే డివార్మింగ్ మాత్రలను ప్రతి చిన్నారి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా పిల్లలకు మాత్రలు వేయించి వారి ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. సర్పంచ్ పద్మ మాట్లాడుతూ, గ్రామంలోని అర్హులైన ప్రతి చిన్నారికి నులిపురుగుల నివారణ మాత్రలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఉపసర్పంచ్ కుమారస్వామి, ఏఎన్ఎం వసంత, అంగన్‌వాడి టీచర్ ప్రేమలత, ఆశా కార్యకర్తలు నర్మద, కవితతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

## పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులకు అడ్డుకట్ట: సర్పంచ్ దీవెల వెంకటేశ్వరరావు

**తల్లాడ,/ జూలై 13 (జర్నలిస్ట్ వార్త):**



వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను తప్పనిసరిగా పాటించాలని కొత్త వెంకటగిరి గ్రామపంచాయతీ సర్పంచ్ దీవెల వెంకటేశ్వరరావు సూచించారు. సోమవారం గ్రామ ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కలుషితమైన ఆహారం, కలుషిత నీటిని తీసుకోకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. జ్వరం, జలుబు, దగ్గు లేదా ఇతర ఆరోగ్య సమస్యల లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్యుల సూచనల మేరకు చికిత్స పొందాలని తెలిపారు. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవి కాలంలో ఉపయోగించిన కూలర్లను పూర్తిగా శుభ్రపరిచి భద్రపరచాలని, ఇంటి పరిసరాల్లో నిరుపయోగంగా ఉన్న పాత్రలు, టైర్లు, డబ్బాలు వంటి వాటిలో నీరు నిల్వ కాకుండా చూడాలని అన్నారు. కొబ్బరి బోండాలు తాగిన తర్వాత వాటిని గ్రామానికి దూరంగా పారవేయాలని సూచించారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమలు వేగంగా వృద్ధి చెంది డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని పేర్కొంటూ, ప్రతి కుటుంబం పరిశుభ్రత పాటించి గ్రామాన్ని వ్యాధుల బారిన పడకుండా కాపాడేందుకు సహకరించాలని సర్పంచ్ దీవెల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు.ఐ

# కొత్తపేటలో నులిపురుగుల నివారణ మందు పంపిణీ చేసిన సర్పంచ్.



**బయ్యారం/,జులై 13.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం కొత్తపేట గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పిల్లలకు నులిపురుగుల నివారణ మందు (ఆల్బెండజోల్ మాత్రల) పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ పాల్గొని పాఠశాల విద్యార్థులకు,అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్న పిల్లలకు వయస్సు ప్రాతిపదికన డోసేజీల ప్రకారం మాత్రలు అందజేశారు. పిల్లల తల్లిదండ్రులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,గంధంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్ అన్నా మేరీ,కృష్ణ చైతన్య,ఏఎన్ఎం భూలీ, నవీన, ఆశ వర్కర్ యమునా,రమణ పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థికి నులిపురుగుల నివారణ మాత్రలు తప్పనిసరి

## -సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్.



**బయ్యారం/,జులై 13.(జర్నలిస్ట్ వార్త)**పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతి విద్యార్థికి నులిపురుగుల నివారణ ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని సింగారం సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా సింగారం అంగన్వాడీ సెంటర్,ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు నులిపురుగుల నివారణ ఎంతో అవసరమని,తల్లిదండ్రులు ప్రతి సంవత్సరం ప్రభుత్వం నిర్వహించే డీవార్మింగ్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్వాడి టీచర్ పద్మ, స్కూల్ చైర్మన్ గుగులోత్ స్వరూపరాణి,ఆశ వర్కర్,తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహనా

## -వ్యవసాయఅధికారి కే. రాజు

**బయ్యారం/,జులై 13.(జర్నలిస్ట్ వార్త)**



ఎల్ నినో ప్రభావం కారణంగా ఏర్పడే వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లేలా అవగాహన కల్పించేందుకు బయ్యారం మండల మహిళా భవనంలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వీఓలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.రాజు గ్రామ ఆర్గనైజర్లను ఉద్దేశించి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో రైతులు పెసర,మినుము, అలసంద,కూరగాయల పంటలు, ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చని వివరించారు. అలాగే రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులు, జీవ ఎరువులు నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. రైతులు వ్యవసాయం, పాడి పరిశ్రమ,కోళ్ల పెంపకం, కూరగాయల సాగు సుస్థిర వ్యవసాయానికి ఇవి ఎంతో దోహదపడతాయని తెలిపారు. మండలంలోని 73 గ్రామ మహిళా సమాఖ్య ప్రతినిధులు తమ గ్రామాల్లో రైతులకు ఈ అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. 5 ఎకరాలకు పైగా సాగు భూమి కలిగిన రైతులను ఆయిల్ పామ్ సాగు వైపు ప్రోత్సహించాలని, అలాగే డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ప్రోత్సహిస్తున్న వెదురు (బాంబూ), మునగ పంటల సాగుపై కూడా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఎం.శ్రీనివాస్, డీపీఎం ఎ. శ్రీకాంత్,కమ్యూనిటీ కోఆర్డినేటర్లు,మండలంలోని 73 గ్రామ ఆర్గనైజర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సీఆర్ఐ స్టార్ పర్ఫార్మెన్స్ అవార్డు వీరన్నకు ప్రకాశ్ ఎలక్ట్రికల్స్ సేవలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

**బయ్యారం, /జూలై 13 (జర్నలిస్టు వార్త):**





మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రకాశ్ ఎలక్ట్రికల్స్ అధినేత నాళ్ల వీరన్నకు సీఆర్ఐ సంస్థ ప్రతిష్ఠాత్మక స్టార్ పర్ఫార్మెన్స్ అవార్డు లభించింది. హైదరాబాద్‌లో నిర్వహించిన సీఆర్ఐ రాష్ట్ర డీలర్ల సమావేశంలో సంస్థ జోనల్ మేనేజర్ మధుసూదన్, తెలంగాణ రీజినల్ మేనేజర్లు శ్రీనివాస్, మహేందర్, రాము, సునీల్‌లు ఆయనకు అవార్డును అందజేశారు. గత నాలుగు దశాబ్దాలుగా రైతులకు నాణ్యమైన సీఆర్ఐ వ్యవసాయ మోటార్లు, ఎలక్ట్రికల్ పరికరాలను అందిస్తూ విశ్వాసాన్ని సంపాదించుకున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ, మహబూబాబాద్ జిల్లాలో ప్రకాశ్ ఎలక్ట్రికల్స్ విశ్వసనీయ బ్రాండ్‌గా నిలిచిందని, నాళ్ల వీరన్న రైతులు, వినియోగదారుల నమ్మకాన్ని నిలబెట్టుకున్న వ్యాపారవేత్త అని ప్రశంసించారు. నాళ్ల వీరన్న మాట్లాడుతూ, సీఆర్ఐ సంస్థ నుంచి ఐదోసారి రాష్ట్ర స్థాయి అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. రైతులకు మరింత మెరుగైన సేవలు అందించి సంస్థ విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. అవార్డు అందుకున్న నాళ్ల వీరన్నను బయ్యారం ఎలక్ట్రికల్ అసోసియేషన్ సభ్యులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఐ

# ప్రభుత్వ పాఠశాలలో 'అన్నా-అక్క' బోధనకు శ్రీకారం

## ఏఐ, డిజిటల్ లెర్నింగ్‌పై విద్యార్థులకు పాఠాలు





**నేలకొండపల్లి, /జూలై 13 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలు పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అన్నా-అక్క మెంటర్షిప్-- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డిజిటల్ లెర్నింగ్ కార్యక్రమం సోమవారం నేలకొండపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆలేటి పరంజ్యోతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మెంటర్లుగా వ్యవహరిస్తూ 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు కృత్రిమ మేధ, డిజిటల్ లెర్నింగ్, ఇంగ్లిష్ కమ్యూనికేషన్ అంశాలపై శిక్షణ అందిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సాంకేతిక పరిజ్ఞానంలో విద్యార్థులు ముందంజలో నిలవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు జి. రమేష్ మాట్లాడుతూ, మారుతున్న సాంకేతిక ప్రపంచంలో కృత్రిమ మేధ వినియోగం రోజురోజుకు పెరుగుతోందని, విద్యార్థులు డిజిటల్ అక్షరాస్యతతో పాటు ఇంగ్లిష్ భాషలోనూ ప్రావీణ్యం సాధించడం కాలానుగుణ అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన తృతీయ సంవత్సరం విద్యార్థిని ఎస్.కె. రిజ్వానా మెంటర్‌గా వ్యవహరిస్తూ విద్యార్థులకు డిజిటల్ పాఠాలను బోధించారు. ఏఐ వినియోగం, డిజిటల్ లెర్నింగ్ విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అన్నా-అక్క కళాశాల కన్వీనర్లు డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు, డాక్టర్ జ్యోతిర్మయి రాణి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ ఎన్. వెంకన్న, డాక్టర్ ఆర్. వెంకట్రాజం రాధిక, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హెల్మెట్ తప్పనిసరి.. ప్రాణ రక్షణే లక్ష్యం

## 'అరైవ్ అలైవ్'లో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించిన పోలీసులు



**బయ్యారం,/ జూలై 13 (జర్నలిస్ట్ వార్త):** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని బయ్యారం ఎస్ఐ ప్రశాంత్‌బాబు సూచించారు. పోలీసు శాఖ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని వెంకట్రాంపురం, ఉప్పలపాడు, బాలాజీపేట, నర్సతండ, గరిమెళ్ల గ్రామపంచాయతీల పరిధిలో వందలాది మంది వాహనదారులతో హెల్మెట్ అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు. మన ఊరుమన బాధ్యత' నినాదంతో చేపట్టిన ఈ ర్యాలీలో పాల్గొన్న ఎస్ఐ ప్రశాంత్‌బాబు మాట్లాడుతూ, హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం గణనీయంగా తగ్గుతుందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా హెల్మెట్ ధరించి తమ కుటుంబాలకు భరోసాగా నిలవాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో పాల్గొన్న వాహనదారులు 'నో హెల్మెట్‌నో ఎంట్రీ' ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పానుగోత్ వెంకన్న, శివాజీ, సేవలాల్, మాలోత్ పార్వతి, వజ్జా భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తి డ్రైనేజీ పనులతో ప్రాణసంకటంగా రహదారి



## అధికారుల నిర్లక్ష్యమా.. పాలకుల వైఫల్యమా?

## పనులు పూర్తి చేయకుంటే ఆందోళనకు దిగుతాం

## : బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్

**ఎల్కతుర్తి,/ జూలై 13 (జర్నలిస్ట్ వార్త):**
ఎల్కతుర్తిదామెర మార్గంలోని జాతీయ రహదారి (ఎన్‌హెచ్765డీజీ)పై చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులు నెలలుగా అసంపూర్తిగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు, పాదచారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందని బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆరోపించారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డ్రైనేజీ నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపివేయడంతో రహదారి పలుచోట్ల దెబ్బతిందన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో హెచ్చరిక బోర్డులు, రక్షణ ఏర్పాట్లు లేకపోవడం వల్ల ప్రమాదాల ముప్పు మరింత పెరిగిందని చెప్పారు. ఇప్పటికే పలువురు



ఇబ్బందిగా వెళుతున్న వాహనాలు

వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రైనేజీలో మురుగునీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమల విజృంభణ పెరిగి ప్రజారోగ్యానికి ముప్పుగా మారిందన్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో చేపట్టిన పనులు నాణ్యతా ప్రమాణాలు, భద్రతా నిబంధనలు పాటించకుండా సాగడం బాధాకరమని విమర్శించారు. ఈ పరిస్థితికి జాతీయ రహదారి అధికారుల పర్యవేక్షణ లోపమా, పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని శ్రీకాంత్ యాదవ్ పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ పనులను పూర్తి చేసి రహదారిని మరమ్మతు చేయాలని, నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

# వికలాంగుల హక్కుల అమలుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోండి

## ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్ వరకు పోరాటం కొనసాగిస్తాం: గిద్దె రాజేష్

**మోతె,/ జూలై 13: (జర్నలిస్ట్ వార్త)**
వికలాంగుల హక్కుల చట్టం2016ను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి వికలాంగుల హక్కులకు భరోసా కల్పించాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ కోరారు. మోతె మండల నూతన ఎస్సై లచ్చిరెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు.



ఈ సందర్భంగా గిద్దె రాజేష్ మాట్లాడుతూ వికలాంగుల హక్కుల చట్టం కేవలం చట్టం మాత్రమే కాదని, సమాన హక్కులు, గౌరవప్రదమైన జీవనం కల్పించే సామాజిక రక్షణ కవచమని పేర్కొన్నారు. చట్టంలోని సెక్షన్ 91, 92 నిబంధనలను ప్రతి పోలీస్ స్టేషన్‌లో కచ్చితంగా అమలు చేయాలని కోరారు. వికలాంగులపై వివక్ష, దాడులు, బెదిరింపులు, అవమానకర వ్యాఖ్యలు, వేధింపులపై వెంటనే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మానసిక వికలాంగ మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు ఆందోళన కలిగిస్తున్నాయని, ఇలాంటి కేసుల్లో రాజీ ప్రయత్నాలకు తావు ఇవ్వకుండా చట్టప్రకారం నిందితులపై చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని అన్నారు. వికలాంగులను వారి వైకల్యాన్ని అవమానకరంగా ప్రస్తావించడం కూడా శిక్షార్హమైన నేరమేనని గుర్తు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా వికలాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్ కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలు అమలు చేసి ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్ కల్పించే వరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తమ ప్రజాస్వామ్య పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎస్సై లచ్చిరెడ్డి వికలాంగుల హక్కుల పరిరక్షణకు చట్టబద్ధంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు

# గోదావరి తల్లి దీవించు..!

## గోదావరి జలాల రాకతో రైతుల్లో ఆనందం..

### తుమ్మల చిత్రపటానికి పాలాభిషేకం



**తల్లాడ/, జూలై 13 (జర్నలిస్ట్ వార్త):** సీతారామ రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలు చేరడంతో తల్లాడ మండల రైతుల్లో ఆనందం నెలకొంది. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఏనుకూరు వద్ద రాజీవ్ లింక్ కెనాల్‌ను సందర్శించి గోదావరి జలాలకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సీతారామ రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా సుమారు 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం కలగడం రైతులకు వరంగా మారిందన్నారు. గోదావరి జలాలను ఈ ప్రాంతానికి తీసుకురావడంలో ప్రత్యేక చొరవ చూపిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే మట్టా రాఘమయి దయానంద్ సహకారాన్ని కొనియాడారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, రైతులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్ఐటీ ఉద్యోగులకు ఊరట

## బకాయి బిల్లుల విడుదల.. జీతాల పెంపు

### బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కరుణాకర్ ఎన్నిక



**హనుమకొండ/, జూలై 13: (జర్నలిస్ట్ వార్త)**ఎన్ఐటీలో ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్లకు ప్రభుత్వం, యాజమాన్యం సానుకూలంగా స్పందించడంతో బకాయి బిల్లులు విడుదలయ్యాయి. అలాగే ఉద్యోగుల జీతాల పెంపు కూడా అమలులోకి రావడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు కరుణాకర్ భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయన ఎన్నిక పట్ల ఎన్ఐటీ ఉద్యోగులు, బీఎంఎస్ నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, పెండింగ్ సమస్యల పరిష్కారానికి మరింత సమర్థవంతంగా కృషి చేస్తానని ఈ సందర్భంగా కరుణాకర్ తెలిపారు.

# మోడల్ స్కూల్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

### బట్టల వ్యాపారి దుర్మరణం.. కారు డ్రైవర్‌కు స్వల్ప గాయాలు



**ఎల్కతుర్తి,/ జూలై 13 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బట్టల వ్యాపారి మృతి చెందాడు. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తారం గ్రామానికి చెందిన పోగుల ప్రసాద్ (54) బట్టల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం హనుమకొండకు వెళ్లి బట్టల సరుకును కొనుగోలు చేసి టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్రవాహనంపై స్వగ్రామం ముత్తారంకు తిరుగు ప్రయాణమవుతున్నాడు. ఈ క్రమంలో ఎల్కతుర్తి మోడల్ స్కూల్ సమీపానికి చేరుకోగానే ఎదురుగా వస్తున్న టాటా కర్వ్ ఈవీ కారు (టిజీ 03 సీహెచ్ 0531) ఢీకొట్టింది. ప్రమాదంలో ప్రసాద్ తీవ్రంగా గాయపడగా, స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు సమాచారం. కారు డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. సమాచారం అందుకున్న ఎల్కతుర్తి ఎస్సై నరసింహారావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, ఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# తల్లాడలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి స్వాగతం

## రైతు సమస్యలపై వినతిపత్రం అందజేసిన బీజేపీ నేతలు



**తల్లాడ,/ జూలై 13 (జర్నలిస్ట్ వార్త):** కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి సోమవారం మణుగూరు సింగరేణి బొగ్గుగనుల పరిశీలనకు వెళ్తూ మార్గమధ్యంలో తల్లాడలో కొద్దిసేపు ఆగారు. ఆయనను బీజేపీ నాయకులు, కార్యకర్తలు పూలదండలతో ఘనంగా స్వాగతించి సన్మానించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి బీజేపీ నాయకులు కేంద్రమంత్రికి వినతిపత్రం సమర్పించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా సిరిపురం మేజర్‌కు సాగునీటిని విడుదల చేసి రైతులకు సాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే సిరిపురం మేజర్‌ను సీతారామ ప్రాజెక్టుతో అనుసంధానం చేసే ప్రక్రియలో రైతుల భూములు సేకరిస్తే, వారికి తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన కిషన్‌రెడ్డి రైతుల సమస్యలను పరిశీలించి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చల్ల నాగులు, నాయకులు రాయల రమేష్, జిల్లా నాయకుడు ఆపద రామారావు, మేజర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యురాలు పెరిక స్వర్ణలత, రైతులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# నులిపురుగుల నిర్మూలనతోనే చిన్నారుల ఆరోగ్య రక్షణ

**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరోజూలై 13 (జర్నలిస్ట్ వార్త):** చిన్నారుల్లో పోషకాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలను నివారించేందుకు నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ధర్మసాగర్ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం ధర్మసాగర్ బాలికల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థులకు నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసి వేయించారు. ప్రతి అర్హులైన చిన్నారికి ఈ మాత్రలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రాజ్‌కుమార్, ఏఎన్ఎం ప్రశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఓటరు జాబితాలో ప్రతి ఒక్కరి పేరు ఉండాలి.

### మాజీ సర్పంచ్ సిందం లక్ష్మీనారాయణ.



**వర్ధన్నపేట/జూలై 13(జర్నలిస్ట్ వార్త);**ఓటరు జాబితాలో ప్రతి ఒక్కరి పేరు ఉండాలని. మాజీ సర్పంచ్ సిందం లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం చెన్నారం గ్రామంలో ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ సర్పంచ్ సిందం లక్ష్మీనారాయణ పాల్గొని, గ్రామస్థులకు ఉన్న పలు సందేహాలను నివృత్తి చేస్తూ సలహాలు, సూచనలు అందించారు. గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని, ఒక్క ఓటు కూడా జాబితా నుండి గాల్లంతు కాకుండా చూడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ అధికారులతో కలిసి ఆయన స్వయంగా ఎన్యూమరేషన్ ఫారాలను పరిశీలించి పూర్తి చేశారు. ఎన్యూమరేషన్ ప్రక్రియలో ఎలాంటి తప్పులు దొర్లకుండా పకడ్బందీగా ఫారాలను నింపాలని అధికారులను ఆదేశించారు. ఓటరు నమోదు ప్రక్రియ విజయవంతం కావడానికి పార్టీ కార్యకర్తలు పూర్తి బాధ్యత తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కల్లెపు రాజు, మండల సోషల్ మీడియా ఇంచార్జి బర్ల సతీష్, సీనియర్ నాయకులు కలకోటి దేవేందర్, బర్ల కొమ్మాలు, కక్కెర్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



# ప్రేమిస్తున్నానని నమ్మించి మోసం..

## గీసుగొండ పరిధిలో పోక్సో కేసు నమోదు




**గీసుగొండ/ జూలై 13(జర్నలిస్ట్ వార్త);**
ప్రేమ పేరుతో మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడి, మోసపూరితంగా గర్భస్రావం చేయించిన నిందితుడిని గీసుగొండ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం. హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌కు చెందిన బొడ్డు బన్నీ (21) అనే యువకుడు, 2023లో పదో తరగతి చదువుతున్న గీసుగొండ పరిధిలోని ఒక బాలికను ప్రేమ పేరుతో నమ్మించి లోబరుచుకున్నాడు. ఎస్ఎస్‌సీ పరీక్షల సమయంలో ఆమెను ఒక వెంచర్‌కు తీసుకెళ్లి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత కూడా పలుమార్లు ఈ దారుణాన్ని కొనసాగించాడు.

### కేకులో మాత్రలు కలిపి...

ఈ క్రమంలో 2025 మార్చిలో బాధితురాలు గర్భం దాల్చగా, నిందితుడు ఆమెకు తెలియకుండా పుట్టినరోజు కేకులో గర్భస్రావ మాత్రలు కలిపి తినిపించాడు. అనంతరం తీవ్ర కడుపునొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా గర్భస్రావం జరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆ తర్వాత కూడా నిందితుడు తన వద్దకు రావాలంటూ వేధించడం, కొట్టడం, చంపేస్తానని బెదిరించడం చేస్తూ వచ్చాడు. ఇటీవల నాలుగు రోజుల క్రితం వరంగల్‌లో బాధితురాలిపై దాడి చేసి, ఆమె మొబైల్ ఫోన్‌ను ధ్వంసం చేశాడు.

### పోక్సో కేసు నమోదు, రిమాండ్

నిందితుడి వేధింపులు భరించలేక బాధితురాలు గీసుగొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం నిందితుడు బొడ్డు బన్నీని అరెస్ట్ చేసి, అతనిపై భారతీయ న్యాయ సంహిత, పోక్సో , చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మహిళలు, మైనర్ బాలికలపై ఇలాంటి అరాచకాలకు పాల్పడే వ్యక్తులను ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు రౌడీ షీట్లు కూడా ఓపెన్ చేస్తామని మామునూరు ఏసీపీ వెంకటేష్ హెచ్చరించారు. ఈ దర్యాప్తులో గీసుగొండ ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్, ఎస్సై కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.